క్లుప్తంగా

మంత్రి అమర్‌నాథ్‌కు ఘనస్వాగతం



తిరుపతి రూరల్: రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదివారం తిరుపతి పర్యటనకు విచ్చేశారు. ఆయనకు రామాయపట్నం పోర్టు ఎండీ పి.ప్రతాప్‌రెడ్డి, కుప్పంబాదూరు డివిజన్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిట్టిబాబునాయుడు ఎయిర్‌పోర్టు వద్ద ఘన స్వాగతం పలికారు. మంత్రితో పాటు తిరుమలకు వెళ్లారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



తిరుపతి ఎడ్యుకేషన్ : వైఎస్సార్‌టీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి ఆవిష్కరించారు. ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో పెనుమార్పులు తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. సీఎం ఆశయ సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు మద్దెల మునిశారద, ప్రధాన కార్యదర్శి వై.సుబ్రమణ్యం, కోశాధికారి బాబూలాల్, నరసయ్య పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో డిప్యూటీ సీఎంలు నారాయణస్వామి, ముత్యాలనాయుడు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, ఎల్లంపల్లి శ్రీనివాస్, మేడా మల్లికార్జున రెడ్డి, పెద్దారెడ్డి, వాసుపల్లి గణేష్, టీటీడీ మాజీ జేఈఓ శ్రీనివాసరాజు, తమిళనాడు మంత్రి ఆర్.గాంధీ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుచానూరు: పద్మావతి అమ్మవారిని ఆదివారం తెలంగాణ మంత్రి గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర దర్శించుకున్నారు.

భీమాకోరేగావ్ విజయోత్సవం

తిరుపతి కల్చరల్: అఖిల భారత అంబేడ్కర్ యువజన సంఘం, ఏపీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం సంయుక్తంగా ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద 205వ భీమాకోరేగావ్ విజయోత్సవం నిర్వహించారు. అఖిల భారత అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతమాకుల పుణ్యమూర్తి, అంబేడ్కర్ భవన్ చైర్మన్ డి.జయరామ్, ఏపీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.చెంగల్‌రాయులు మాట్లాడుతూ బహుజనులను అణచివేతకు గురి చేసిన మనువాదంపై యుద్ధం చేసి వారి ఉనికికి బాటలు వేసిన మహనీయుడు భీమాకోరేగావ్ అని పేర్కొన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే పేదల సంక్షేమం

- పేదలకు మంచి జరుగుతుంటే ఓర్వలేని పచ్చమీడియా
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి తుడా: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే పేదలకు మంచి జరుగుతోందని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం 33వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి వారు పొందిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రమంతటా పింఛన్ల పండుగ జరుగుతోందన్నారు. దాన్ని పక్కదారి పట్టించేందుకు పింఛన్లు తొలగించారంటూ పచ్చ మీడియా గందరగోళం సృష్టిస్తోందని దుయ్యబట్టారు. పేదలకు మంచి జరుగుతుంటే ఓర్వలేకపోతోందని విమర్శించారు. గతంలో కంటే తిరుపతి నగరంలో 1,082 పింఛన్లు పెరిగాయని గుర్తు చేశారు.



వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

అనంతరం పెంచిన రూ.2,750 పింఛను మొత్తాన్ని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. పింఛను తొలగిస్తారంట అని అన్న వృద్ధురాలిని సముదాయించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ పింఛన్లు తొలగించమని తెలిపారు. మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్ దూదికుమారి, డివిజన్ అధ్యక్షు డు మద్దాలి శేఖర్ రాయల్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఆర్థిక భరోసా



భాకరాపేట: పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

భాకరాపేట : కొత్త ఏడాది తొలి రోజున వృద్ధులకు ఆత్మ గౌరవం కల్పించడంతో పాటు ఆర్థిక భరోసాను ఇచ్చిన ఘనత సీఎం జగనన్నకు దక్కుతుందని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం భాకరాపేటలో పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అవ్వా, తాతలు, ఒంటరి మహిళలు, వితంతువులు తదితరులకు పింఛనును ప్రతి నెలా రూ.2,750 అందజేస్తున్నట్టు తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమం ఆపకుండా పనిచేస్తున్న జగనన్నకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానికులు థ్యాంక్యూ సీఎం సార్ అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి, సీడీసీఎంఎస్ చైర్మన్ సామకోటి సహదేవరెడ్డి, స్థానిక సర్పంచ్ సాకిరి భూపాల్, పార్టీ మండల అధ్యక్షుడు కొండారెడ్డి, ఎంపీడీవో దేవేంద్రబాబు, తహసీల్దార్ హనుమాన్‌నాయక్ పాల్గొన్నారు.

ఆలయాల్లో నూతన శోభ

తిరుపతి కల్చరల్/తిరుపతి రూరల్ /చంద్రగిరి/భాకరాపేట/ : ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి, శ్రీకోదండరామాలయం, కపిలేశ్వరస్వామి, అలిపిరి పాదాల మండపంలోని శ్రీవారు, లక్ష్మీనరసింహస్వామి ఆలయాలతో పాటు ఇస్కాన్ మందిరం, కొత్తవీధిలోని కన్యకాపరమేశ్వరి, కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అలాగే చంద్రగిరిలోని ఆలయాలతోపాటు తిరుచానూరు పద్మావతి అమ్మవారు, తుమ్మలగుంటలోని కల్యాణ వెంకన్న, శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి, పేరూరు బండపై ఉన్న వకుళమాత, దేవరకొండ వెంకటేశ్వర స్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

పాకాల : స్థానిక సత్యమ్మ ఆలయంలో ఆదివారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



ప్రత్యేక ఫల పుష్ప అలంకరణలో ఆంజనేయస్వామి

అలరించిన నూతన వేడుకలు



తిరుపతి కల్చరల్: కరకంబాడి రోడ్డులోని రామి గెస్ట్ లైన్ హోటల్లో శనివారం రాత్రి నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలు అలరించాయి. 2022కు వీడ్కోలు, 2023కు స్వాగతం పలుకుతూ చేపట్టిన సంగీత విభావరి, మ్యాజిక్ షో, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈవెంట్‌కు హాజరైన వారికి అపరిమిత బఫెట్, స్నాక్స్, శీతల పానీయాలు ఏర్పాటుచేశారు. హోటల్ జనరల్ మేనేజర్ వంశీ కిరణ్, అడ్మిన్ మేనేజర్ భానుప్రకాష్ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

కలెక్టరేట్‌లో



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా, కార్యవర్గ సభ్యులు

తిరుపతి అర్బన్/తిరుపతి తుడా: తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో ఆదివా రం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, జేసీ డీకే బాలాజీ, డీఆర్వో ఎం.శ్రీనివాసరావు, ఆర్డీవో వి.కనకనరసారెడ్డి కేక్ కట్ చేశారు. అలాగే కలెక్టర్‌కు ఏపీ హంస జిల్లా నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో

తిరుపతి అలిపిరి: టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్పీ చక్రవర్తికి సీఐ చంద్రశేఖర్, ఆర్ఐ సురేష్ కుమార్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

మూలస్థానమ్మ సంక్రాంతి పోస్టర్ల ఆవిష్కరణ

చంద్రగిరి: గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ అమ్మవారి సంక్రాంతి ఉత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 16వ తేదీన రథోత్సవం, సాయంత్రం సింహ వాహనం, 17వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు కొండచుట్టు ఉత్సవం, 18న ఉదయం వసంతోత్సవం, రాత్రి తోటోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి



వైకుంఠ ఏకాదశి దర్శన టోకెన్ల కోసం విష్ణు నివాసం వద్దకు తరలివచ్చిన భక్తులు - సాక్షి ఫొటోగ్రాఫర్ తిరుపతి

సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం





సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు, పింఛను అందజేస్తున్న తిరుచానూరు సర్పంచ్

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆదివారం పింఛను వారోత్సవాల్లో భాగంగా తొలిరోజు 50 డివిజన్లలో పార్టీ నాయకులు, కార్పొరేటర్లు పింఛన్లు అందజేశారు. నగరంలో 19,124 మంది పింఛనుదారులు ఉండగా, తొలి రోజు 75 శాతం మందికి పైగా పింఛను మొత్తాన్ని అందజేసినట్టు అధికారులు తెలిపారు. 34వ డివిజన్‌లో పింఛన్ల పెంపుపై లబ్ధిదారులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్పొరేటర్ శ్రావణి మునిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరు: స్థానిక పంచాయతీ పరిధిలో ఆదివారం ప్రభుత్వం పెంచిన పింఛనును రూ.2750 సర్పంచ్ రామచంద్రారెడ్డి, వార్డు సభ్యులు, వలంటీర్లు, కార్యదర్శులు లబ్ధిదారులకు అందజేశారు. తిరుచానూరులో ఇప్పటికే 2,064 మంది పింఛనుదారులు ఉండగా, కొత్తగా 107 పింఛన్లు మంజూరయ్యాయి. యోగమల్లవరంలో సచివాలయంలో పింఛన్ల పెంపు సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి: మండలంలోని అగరాల పంచాయతీ సర్పంచు భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు దేవారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పింఛనుదారులు సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ ఎల్లో మీడియా అసత్య ఆరోపణలను ప్రజలే తిప్పికొట్టడం హర్షణీయమన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛను అందజేస్తున్నట్టు తెలిపారు.

బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

చంద్రగిరి : మండలంలోని తొండవాడ వద్ద ఆదివారం రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. రామచంద్రాపురం మండలం కనికాపురానికి చెందిన ప్రకాష్ బైక్‌పై తిరుపతి నుంచి చంద్రగిరికి వస్తుండగా మరో బైక్ ఢీకొంది. ప్రకాష్, మరో బైక్‌పై వస్తున్న రోహిత్, అతడి స్నేహితుడు గాయపడ్డారు. వారిని 108లో తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రుయా అభివృద్ధి కమిటీ వర్కింగ్ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్ రాయల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నర్సింగ్ అసోసియేషన్ సభ్యులు - తిరుపతి తుడా

ఎమ్మెల్యే భూమనకు శుభాకాంక్షలు



ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి ఆదివారం పద్మావతిపురంలోని ఆయన స్వగృహం వద్ద మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతి గంగమ్మ ఆలయ అర్చకులు ఆశీర్వాదం ఇచ్చారు. – తిరుపతి కల్చరల్

ఎస్వీయూ వీసీకి..



ఎస్వీయూ వీసీ కె.రాజారెడ్డికి ఆదివారం పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ వారితో యూనివర్సిటీ అభివృద్ధి, నాక్ ప్రణాళికలపై చర్చించారు. రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్, పూర్వ రెక్టార్ శ్రీకాంత్‌రెడ్డి, డీన్లు అప్పారావు, రత్నాకరం, దామోదరం రెడ్డి, ప్రిన్సిపాళ్లు శ్రీనివాసులురెడ్డి, పద్మనాభం, తులసీ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. - తిరుచానూరు